క్లుప్తంగా

సీహెచ్‌సీకి ఆర్థిక సహాయం



వైద్యాధికారి జానకీదేవికి నగదును అందజేస్తున్న కిరాణా వర్తకసంఘం ప్రతినిధులు

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో దంతవైద్య విభాగంలో అవసరమైన దంత వైద్య పరికరాలు కొనుగోలు చేసేందుకు స్థానిక కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని స్థానిక ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు ఆధ్వర్యంలో సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవికి వర్తక సంఘం ప్రతినిధులు బుధవారం అందజేశారు. దాతలు ఆర్థిక సహకారంతో పైపల్స్ ఎయిర్ కంప్రెషర్, ఇతర దంత పరికరాలను కొనగోలుకు ఈ మొత్తాన్ని వినియోగించినట్టు దంతవైద్యులు డా.ఉమామహేశ్వరరావు తెలిపారు. దంతవైద్య పరికరాలు కొనుగోలుకు ఆర్థిక సహకారం చేసిన కిరాణా వర్తక సంఘం ప్రతినిధులను వైద్యాధికారిణి జానకీదేవీ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

కిర్లంపూడి: దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈ నెల 3న ఏఎల్ఐఎంసీఓ సంస్థ ఉచితంగా దివ్యాంగుల ఉపకరణలు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా అందజేయనున్నట్టు తెలిపారు.

సకాలంలో పింఛన్లు అందజేయాలి

కిర్లంపూడి: సకాలంలో పింఛన్లు అందజేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశపు హాలులో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ విద్యా సహాయకులతో బుధవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పింఛనుదారులకు గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభించి సాయంత్రం 6 గంటలలోపు పింఛను పంపిణీ పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచి, నీటి వనరుల క్లోరినేషన్ విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి సత్యప్రసాద్, ఎంఈఓ టి.జోషఫ్ తదితరులు ఉన్నారు.

విధిగా మొక్కలు నాటాలి



సోమవరం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న భాజపా నాయకులు

కిర్లంపూడి: పాఠశాల ఆవరణలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని భాజపా మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు అన్నారు. మండల పరిధిలోని సోమవరం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తల్లి పేరున మొక్కను నటాలన్నారు. అనంతరం పాఠశాలలో తన తల్లి పేరున మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మచ్చా వెంకటరమణ, నగపల్లి జల్‌బాబు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: పట్టణంలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జీఎన్‌టీ రోడ్డు ఫీడర్‌లో ఎల్ఐసీ ఆఫీసు, మార్కండ్రాజుపేట, ఆర్ఎస్.పేట, జీఎస్‌టి.రోడ్డు, గొల్ల అప్పారావు సెంటర్, పోస్టాఫీసు వీధి, చేపల మార్కెట్, మేదరిపేట, తారకరామానగర్, గరువువీధి, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

జి.కొత్తపల్లిలో పొలంబడి



జి.కొత్తపల్లిలో రైతులకు పొలంబడి సూత్రాలను వివరిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: జి.కొత్తపల్లిలో వ్యవసాయాధికారి పి.గాంధీ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంటలో యాజమన్య సూత్రాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు పురుగు మందుల విష ప్రభావం గురించి వివరించారు. వరి నారును తుంచుటలో ప్రాముఖ్యత, బీజామృతంతో నారు శుద్ధి చేసే విధానాన్ని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహయకుడు క్రాంతి తదితరులు పాల్గొన్నారు,

ఆవేతనం



ఉపాధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

- రెండు నెలలుగా అందని ఉపాధి వేతనాలు
- రూ.3.20 కోట్ల వేతనాలు బకాయి
- అర్ధాకలితో ఉపాధి కూలీలు

ప్రత్తిపాడు రూరల్: వలసలు అరికట్టేందుకు ఏర్పాటు చేసి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్లక్ష్యానికి గురవుతోంది. కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉండాల్సిన పథకం తీవ్ర ఆవేదనకు కలిగిస్తోంది. సకాలంలో వేతనాలు చెల్లించకుండా కూలీల కడుపు కొడుతోంది. కనీస సౌకర్యాలు లేకున్నా మండుటెండల్లో, వానల్లో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. పూట పూటకు అగచాట్లు పడుతున్న కూలీలకు వేతనాలు రాక.. చేసిన అప్పులు తీరే మార్గం లేక.. ఇల్లు గడిచే దారిలేక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలో గత జూన్ మాసం నుంచి ఇప్పటి వరకూ 51,401 మంది ఉపాధి కూలీలకు 1.28 లక్షల పనిదినాలకు రూ.3.20 కోట్ల వేతనాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఇంత వరకూ కూలీలకు సొమ్ములు అందించలేదు. దీంతో రోజుగడవక కూలీలు అర్ధాకలితో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలకు పని చేసిన 10 రోజుల్లోగా వేతనాలు వారి ఖాతాకు నగదు రూపంలో జమ చేయాలి. అయితే రెండు నెలలుగా కూలీలకు వేతనాలు జమకావకపోవడంతో ఉపాధి వేతనాలపై ఆధారపడి జీవించే కూలీలకు ఏం చేయాలో తెలియని దిక్కు తోచని పరిస్థితి ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి వేతనాలకు నిధులు మంజూరు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



గత పదేళ్ల నుంచి ఉపాధి పనులు చేస్తున్నాం. అప్పుడు సక్రమంగానే వేతనాలు ఇచ్చేవారు. గత జూన్, జూలై నుంచి ఉపాధి వేతనాలను ప్రభుత్వం మంజూరు చేయలేదు. రోజు కూలితో బతికేవాళ్లం. రెండు నెలల నుంచి జీతం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్నాం. చేతిలో చిల్లుగవ్వలేక అల్లాడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా కూలి సొమ్ములు మంజూరు చేయాలి.

–దేవ బాబ్జి, ఉపాధి కూలీ, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం

వారం రోజుల్లో జమ చేస్తాం



మండలంలో 15,507 జాబ్ కార్డులు ఉన్నాయి. వాటిలో 7,375 కార్డులకు సంబంధించి 10,036 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. వీరికి 32 వేల పని దినాలకు సంబంధించి ఎనిమిది వారాల ఉపాధి కూలీ సొమ్ములు జమ కావాలి. కూలీల జాబితాను ఉన్నతాధికారులకు నివేదించాం. అక్కడ నుంచి నిధులు మంజూరు కాగానే ఈ సొమ్ములు వారం రోజుల్లో ఉపాధి కూలీల ఖాతాల్లో జమ చేస్తాం.

– పీవీ కుమార స్వామి, ఏపీఓ, ప్రత్తిపాడు

8న స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు



ఎన్నికల నోటిఫికేషన్‌ను ఏఓకు అందజేస్తున్న ఎంఈఓలు

రౌతులపూడి: మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు ఎంఈఓ–2 గాడి కొండబాబు తెలిపారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం ఉదయం పది గంటలకు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసి మధ్యాహ్నం రెండు గంటలకు ఓటరు జాబితా ప్రదర్శన ఉంటుందన్నారు. ఐదో తేదీన ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వీకరించి, పరిష్కరిస్తామన్నారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఓటరు జాబితా ప్రదర్శన ఉంటుందన్నారు. ఎనిమిదిన పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుల ఎన్నికలు నిర్వహణ, అదే రోజు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ ఉంటుందన్నారు. రెండు గంటలకు ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణస్వీకారం, మూడు నుంచి మూడున్నర గంటల వరకు పాఠశాల అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

గండేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో (ఎస్ఎంసీ) స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఆగస్టు 8న నిర్వహించనున్నట్టు ఎంఈఓలు కేహెచ్ నాయక్, కె.వెంకటరెడ్డి తెలియజేశారు. ఇందుకు సంబంధించి ఎన్నికల నిర్వాహణ నోటిఫికేషన్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేస్తున్నామన్నారు.

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లకు ఒకటో తేదీ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. పేరెంట్స్ కమిటీ పేరును స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు చేసి, కమిటీలకు ఈ నెల 8న ఎన్నిక నిర్వహించనున్నట్టు చెప్పారు. ఒకటిన నోటిఫికేషన్ జారీ, మధ్యాహ్నం ఓటరు జాబితా ప్రదర్శన, 5న అభ్యంతరాల స్వీకరణ 8న ఎన్నిక, అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులచే ప్రమాణ స్వీకారం ఉంటుందని ఎంఈఓ తెలిపారు.

కిర్లంపూడి: ప్రభుత్వ పాఠశాలలో యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు ఎంఈఓలు టీ.జోషఫ్, మక్కా చిన్నారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఓటరు జాబితా ప్రదర్శన, ఈ నెల 5న ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరణ ఉంటాయన్నారు. ఓటరు జాబితాను ఖరారు చేసి నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. 8న ఎన్నికలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



ఏలేశ్వరంలో విద్యార్థులు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు మూది నారాయణ స్వామి, బొదిరెడ్డి గోపి, సుబ్బరాజు, కోరుకొండ నూకరాజు, గట్టెం వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని మరిడమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిత

ప్రత్తిపాడు: చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిత అందుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో ఆమె ప్రసంగిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత ప్రమాణాలు సాధించాలని అన్నారు. అనంతరం స్టూడెంట్ కిట్లను ఆమె అందజేశారు. ఎంఈఓ వి.రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో ఉత్తరకంచి, ఏలూరు గ్రామ సర్పంచులు మంతిన శ్రీను, రొంగల సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీపతిరావు, మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతారామం, మాజీ వైస్ ఎంపీపీ బొల్లు కొండబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, ఎంఈఓ 2 వై అచ్చిరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరించాలి

కోటనందూరు: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరించాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి వచ్చిన అనితను బుధవారం మోషే కలిసి వినతిపత్రం అందజేశారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారికి మెరుగైన విద్య, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి అనిత దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్లు మోషే తెలిపారు. పలువురు దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

గండేపల్లి: సారా తయారీ చేసే వ్యక్తికి పెద్దాపురం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు కె.గోపాలపురానికి చెందిన మోరుకుర్తి సూర్యచంద్ర గ్రామ శివారు పొలాల్లో సారా చేస్తుండగా బుధవారం తమ సిబ్బందితో కలిసి దాడి చేసి అతనిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో కత్తెర పురుగు నివారణ



కాట్రావులపల్లి గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగ్గంపేట: మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల కత్తెర పురుగు తెగులును నివారించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని కాట్రావులపల్లి, గుర్రంపాలెం, జగ్గంపేట తదితర గ్రామాలలో ఏరువాక శాస్త్రవేత్తలు, డాక్టర్ ఏ సీతారామశర్మ, డాక్టర్ ఎం.రామభద్రరాజు, మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ పర్యటించారు. మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న తోటల్లో కత్తెర పురుగు గుర్తించామని, దీని నివారణకు ఎమోమెక్టిన్ బెంజిఏట్ 80 గ్రాములు, లేదా స్పైనిటరామ్ 100 మిల్లీలీటర్ల ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుముడత నివారణకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారితే మిషన్ శక్తి లక్ష్యం



జగ్గంపేటలో మిషన్‌శక్తిపై నిర్వహించిన అవగాహన ర్యాలీ

జగ్గంపేట: మహిళా సాధికారిత కలిగిన సమాజాన్ని సృష్టించడమే మిషన్ శక్తి ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. జగ్గంపేటలో బుధవారం ర్యాలీ నిర్వహించి, అనంతరం వెలుగు కార్యాలయంలో మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పించారు. కేంద్ర మహిళా అభివృద్ధి, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. బాలికలు,మహిళలకు ఎన్నో విధాల మేలు కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు,అంగన్‌వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

కేరళ ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి



కేరళ బాధితులను ఆదుకోవాలని ప్రదర్శన నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం సభ్యులు

గోకవరం: కేరళ రాష్ట్రం పయనాడ్‌లో కొండ చర్యలు విరిగిపడిన ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. కేరళ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రంపయర్రంపాలెం గ్రామంలో బుధవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కర్నాకుల మాట్లాడుతూ పయనాడ్‌లో కొండచర్యలు విరిగి పడి వందలాది మంది మృతి చెందడం బాధాకరమన్నారు. వందల కుటుంబాలు వరదలో చిక్కుకుని నిరాశ్రయులయ్యారన్నారు. కేరళలో ఇటువంటి సంఘటనలు జరగడం పరిపాటిగా మారిందన్నారు. ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించి వెంటనే బాధితులను అన్నివిధాల ఆదుకోవాలని డిమాండ్ ఏశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి డి.సురేష్, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్న హుండీ రాబడి రూ.8.23 లక్షలు



ఆలయంలోహుండీ లెక్కిస్తున్న దృశ్యం

గోకవరం: తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఈఓ గండి లక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో కోరుకొండ వీవీ రెడ్డి పంతులు సత్రం ఈఓ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో వీఆర్వో, పోలీసు, గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. ఈ లెక్కింపులో ఐదు నెలల 22 రోజులకు రూ.8,23,298 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు బద్దిరెడ్డి అచ్చన్నదొర, దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వల్లూరి సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి



వేట్లపాలెం పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలను తెలుసుకుంటున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశించిన సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య పిలుపు నిచ్చారు. బుధవారం మండల పరిధిలో వేట్లపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రవేశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లు నిండిన పిల్లలను నేరుగా ఒకటవ తరగతిలో చేర్చేలా తల్లి దండ్రులల్లో అవగాహన పెంచాలన్నారు. విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలు, రాత నైపుణ్యాలను ప్రతి తరగతికి వెళ్లి పరిశీలించారు. విద్యార్థుల బ్యాగ్‌లలో వారు పుస్తకాలు పెట్టుకునే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ఫోరెన్సిక్ మాసపత్రికను విడుదల చేస్తున్న అతిథులు, యూనివర్సిటీ అధ్యాపకులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సరికొత్త రికార్డ్స్‌ను సృష్టించినట్టు ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ తెలిపారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు ఫోరెన్సిక్ శాస్త్రీయ పద్ధతులను అనుసరించి గంటలో 1,037 వేలిముద్రలు సేకరించడం ద్వారా సరికొత్త రికార్డును సృష్టించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన కె.సరళ, కాకినాడ సీఐడీ, ఫింగర్ ప్రింట్ బ్యూరో, సబ్‌ఇన్స్పెక్టర్ ఎస్.ప్రశాంతి పాల్గొని వేలిముద్రలను పరిశీలించారు. అనంతరం ఫోరెన్సిక్ విభాగానికి చెందిన మాసపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చైర్మన్ ఎన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డైరక్టర్ సుగుణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

ఏలేశ్వరంలో సువార్త ర్యాలీ

ఏలేశ్వరం: ఆంధ్ర సువార్తిక లూథరన్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం సువార్త ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి, బాలాజీచౌక్, పలుప్రాంతాల మీదుగా ర్యాలీ సాగింది. వక్తలు మాట్లాడుతూ సంఘం ద్వారా సువార్త ప్రచారంతో పాటు పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది ఇదే రోజున వార్షికోత్సవ ర్యాలీ జరుపుతామన్నారు. కార్యక్రమంలో సంఘపెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

బుచ్చింపేట, తొర్రేడు మీదుగా బస్సు సర్వీసు



డిపో మేనేజర్ రామన్న

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి బుచ్చింపేట, తొర్రేడు, కాతేరు మీదుగా రాజమహేంద్రవరం కాంప్లెక్స్‌కు శుక్రవారం నుంచి బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచనల మేరకు ఆర్ఎం ఆదేశాలతో ఈ ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు ఉదయం 8.05 గంటలకు గోకవరంలో బయలుదేరి 8.35 గంటలకు బుచ్చింపేట చేరుకుని 9.10 గంటలకు రాజమహేంద్రవరం కాంప్లెక్స్‌కు చేరుకుంటుందన్నారు. తిరిగి రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సాయంత్రం 5.05 గంటలకు బయలుదేరి 5.35 గంటలకు బుచ్చింపేట, 6.10 గంటలకు గోకవరం చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్తీ ఆయిల్ రవాణా ముఠా అరెస్టు

- కురెళ్లగూడెం వద్ద ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- 210 లీటర్ల కల్తీ ఆయిల్ స్వాధీనం డ్రైవర్‌తో సహా ముగ్గురి అరెస్టు

భీమడోలు: ఆటోలో కల్తీ ఆయిల్ అక్రమ రవాణా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను భీమడోలు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. కాకినాడ జిల్లా శంఖవరం మండల కత్తిపూడి గ్రామానికి చెందిన తోట తాతబ్బాయి రాజు, తోట చంటిబాబు, దూడల వెంకటరమణ, కుశలం శ్రీరాములు కొంత కాలంగా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా డీజిల్, పెట్రోల్‌లను విడిగా విక్రయిస్తున్నారు. అందులో సాల్వెంట్ ఆయిల్ కలిపి వాటిని కల్తీ చేస్తూ రహదారిపై వెళ్లే వాహనదారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భీమడోలు పోలీసులకు అందిన సమాచారం మేరకు కురెళ్లగూడెం వేబ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా నలుగురు సభ్యుల ముఠా ఓ ఆటోలో 210 లీటర్ల కల్తీ ఆయిల్‌ను తరలిస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ గుర్తించారు. ఆటో, ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్, మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో పనిచేయాలి

- పారిశుధ్య కార్మికులకు కమిషనర్ భావన పిలుపు
- పలు ప్రాంతాల్లో పనుల పరిశీలన



పారిశుధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజల భాగస్వామ్యంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన పారిశుధ్య కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం టిడ్కో గృహ సముదాయంలోని పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. 3, 4 సర్కిళ్ల పరిధిలోని డైరీ ఫారం సెంటర్, అయోధ్య నగర్ ప్రాంతాల్లోని మస్టర్ కేంద్రాలను కూడా ఆమె సందర్శించారు. అక్కడి పారిశుధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజల భాగస్వామ్యంతో సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్మికులకు ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలు సహకరించి తడి–పొడి చెత్తను వేరువేరుగా ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని సూచించారు. మస్తరు కేంద్రాల వద్ద రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బంది హాజరవుతున్న సమయాన్ని ఆరా తీశారు. అలాగే వివిధ దశల్లో ఉన్న అన్న క్యాంటీన్ల అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, ఏఈలు వై.నాగేశ్వరరావు రమేష్ బాబు, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

కనీస ధరతో సన్నబియ్యం ఇవ్వండి

- సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: నాణ్యమైన సన్న బియ్యం కనీస ధర నిర్ణయించి విక్రయిస్తే ప్రజలు వంద శాతం వినియోగించుకునే అవకాశం ఉందని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు, అంగన్‌వాడీ సెంటర్లకు, సంక్షేమశాఖ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకాలకు పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతపై కలెక్టర్ షాన్ మోహన్ బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఫోర్టిఫైడ్ బియ్యం బాగానే ఉన్నాయని, మరిన్ని రకాల సన్నబియ్యాన్ని కనీస ధరకు అందజేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు తీరు, సరుకుల నాణ్యత తదితరాలపై కార్డుదారులు, లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు సర్వే నిర్వహించి నివేదికను అందజేయాలని పౌర సరఫరాల ఉప తాహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్ట అమలుకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.